క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం రేపు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ మండల, మున్సిపాలిటీ, అనుబంధ విభాగాల నూతన కమిటీల కూర్పునకు ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు చీమకుర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి టౌన్ పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పి-4 సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో పి-4 సర్వేను మంగళవారం సంతనూతలపాడు ఎంపీడీవో టి.సురేష్ బాబు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపట్టారని, సర్వే పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మంగమూరు పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్ ఉన్నారు.

సుబ్బయ్యకు నివాళి

ఒంగోలు వన్‌టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత ఉద్యమ నాయకుడు చప్పిడి సుబ్బయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని దళిత సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు పక్కా గృహాలు, వ్యవసాయానికి భూములు ఇప్పించడంలో సుబ్బయ్య కృషి చేశాడన్నారు. మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు దండేల కృష్ణ, గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా సుబ్బారావు, దళిత హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు ముప్పవరపు గోపి, యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు, ఉప్పలపాడు సర్పంచ్ మేడికొండ మురళి పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీ బాధిత కుటుంబాలకు తహసీల్దార్ పరామర్శ

చీమకుర్తి రూరల్: మండలంలోని బక్కిరెడ్డిపాలెంలో ఇటీవల జరిగిన ఘర్షణలో బాధిత ఎస్టీ కుటుంబాలను తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఎంపీడీవో కే రాఘవేంద్ర మంగళవారం పరిశీలించారు. బాధితులకు 50 కేజీల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చిన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణ కాశీ..రామతీర్థం

- రామతీర్థంలో నేడు, రేపు మహాశివరాత్రి ఉత్సవాలు
- ముస్తాబైన మోక్ష రామలింగేశ్వరస్వామి దేవస్థానం



రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం



ప్రత్యేక అలంకరణలో మోక్ష రామలింగేశ్వరస్వామి

చీమకుర్తి రూరల్: జిల్లాలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన చీమకుర్తి మండలం రామతీర్థంలోని గంగా బాలాత్రిపుర సుందరీ సమేత మోక్షరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా బుధ, గురువారాలు ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలు జరిగే రెండు రోజులూ రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు స్వామివారు దర్శనమిస్తారు. ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామివార్లకు కల్యాణం నిర్వహిస్తారు.

రామతీర్థం మోక్ష రామలింగేశ్వరస్వామి దేవాలయం స్థల పురాణం:

శ్రీరాముడు లంకలో రావణాసుర వధ అనంతరం అయోధ్యకు తిరిగి వెళ్తూ తనపై ఉన్న బ్రహ్మ హత్యా పాతక నివారణకు శివ లింగాలను ప్రతిష్ఠిస్తూ వచ్చారు. ఈక్రమంలో రామతీర్థం పుణ్యక్షేత్రంలో కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారని, ఆలయానికి వెనుకవైపున ఉన్న కోనేటిని తవ్వించారని, రామునిచే తవ్వించిన తీర్థం (కోనేరు) కావడంతో ఈ ప్రాంతానికి రామతీర్థం అని పేరు వచ్చినదని ప్రతీతి. బ్రహ్మహత్యా దోష పరిహారంగా శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో శివుడికి మోక్ష రామలింగేశ్వరుడని పేరు వచ్చిందని కథనం.

మహాశివరాత్రి ఉత్సవాల వివరాలు:

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 5 గంటలకు విఘ్నేశ్వర పూజ, అభిషేకం, 6 గంటల నుంచి 10 వరకు అభిషేకాలు. రాత్రి 8 గంటల నుంచి స్వామివారి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి నవావరణ పూజాదులు సహస్రనామార్చనలు నిర్వహిస్తారు. 27వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి శ్రీగంగా బాలాత్రిపుర సుందరీ సమేత మోక్ష రామలింగేశ్వరస్వామి వారి కళ్యాణం నిర్వహిస్తారు. కల్యాణోత్సవ ఉభయ దాతలు గూడ చిదంబర శాస్త్రి, మాధవీ లత, గూడ రామ్మోహన్ శర్మ, విజయలక్ష్మి వ్యవహరిస్తారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు చీమకుర్తి ఆధ్వర్యంలో ఆర్‌ఎల్ పురం పంచాయతీ ద్వారా ఉచిత మంచినీటి సరఫరా చేస్తారు. వాసవీ గ్రానైట్స్, శిద్దా రాఘవరావు ప్రసాదాలు, ఎస్‌వీఎస్ ఎస్‌జీ గ్రానైట్స్ మల్లినేని బుల్లబ్బాయి లైటింగ్, పూల డెకరేషన్ నిర్వహిస్తారని అర్చకులు జి వెంకటేశ్వర్లు, ఓ సూర్యప్రకాశరావు తెలిపారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు



పాపా కాలనీలోని శివాలయం

ఒంగోలు మెట్రో: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఒంగోలు నగరంలోని శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. కేశవస్వామి పేటలోని కాశీవిశ్వేశ్వర ఆలయం, కొత్తపట్నం బస్టాండ్‌లోని రాజరాజేశ్వర స్వామి ఆలయం, సంతపేటలోని సాయిబాబా ఆలయంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. అభిషేకాలు, బిల్వార్చనలు, కల్యాణ మహోత్సవం చేస్తారు. కాశీవిశ్వేశ్వర ఆలయంలో గురువారం సాయంత్రం నంది వాహనంపై ఉత్సవమూర్తులతో నగరోత్సవం నిర్వహిస్తారు. సంతపేట సాయిబాబా మందిరంలో కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు రుద్ర యాగం, చండీ యాగాలు, కాశీ విశ్వేశ్వర స్వామి మూలవిరాట్ కు సామూహికంగా అభిషేకాలు, రాత్రి 11 గంటలకు లింగోద్భవ సమయాన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, గురువారం ఉదయం ఎనిమిది గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం, సాయంత్రం ఆరు గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులతో నగరోత్సవం నిర్వహిస్తున్నారు. స్వామివారి మూలవిరాట్‌కు భక్తులు స్వయంగా అభిషేకాలు చేసుకునే వీలు కల్పించారు. స్థానిక భక్తమండలి ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు జరుగుతాయి. స్థానిక అంజయ్య రోడ్ లోని పంచముఖేశ్వర శివాలయం, రంగారాయుడు చెరువు వద్ద ఉన్న అరుణాచలేశ్వర ఆలయం, పాపా కాలనీలోని శివాలయం, మంగమూరు రోడ్డు లోని హరిహర సుత అయ్యప్ప స్వామి ఉపాలయంగా ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామికి, మంగమూరు రోడ్డు లోని జెడ్పీ కాలనీలోని శ్రీ సత్య సాయి బాబా మందిరంలో మహేశ్వరుడికి, విశేష అర్చనలు చేసేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న థామస్

ఈతముక్కల (కొత్తపట్నం): మండలంలోని ఈతముక్కల హైస్కూల్ విద్యార్థులకు ఎంఎంఆర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 148 మందికి పంపిణీ చేశారు. ఎంఎంఆర్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ మక్కెన థామస్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడినందున ఇష్టపడి చదివితే మీరు అనుకున్నది సాధించవచ్చన్నారు. విద్య అనేది అపారమైన జ్ఞానమని, దాన్ని ఎవరూ దొంగించలేరని, చనిపోయేంత వరకు మనతోనే ఉంటుందని గుర్తు చేశారు. ఈతముక్కల హైస్కూల్ విద్యార్థులకు ఏ కష్టమొచ్చినా ఎంఎంఆర్ ఫౌండేషన్ సంస్థ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పదో తరగతిలో బాగా చదువుకుని మంచి మార్కులు వచ్చిన విద్యార్థులకు తమ సంస్థ ఎంఎంఆర్ ఫౌండేషన్ తరఫున ఆర్థిక చేయూత అందిస్తామని థామస్ సమావేశంలో ప్రకటించారు. ఎంఆర్ ఫౌండేషన్ తరఫున ఇప్పటికే 70కి పైగా పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరానికి ఎంఎంఆర్ ఫౌండేషన్ తరఫున విద్యార్థులకు 10 వేలకుపైగా నోట్‌బుక్స్ పంపిణీ చేసేలా కార్యచరణ రూపొందినట్లు థామస్ తెలిపారు. స్కూల్ యాజమాన్యం థామస్‌ను ఘనంగా సన్మానించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ పున్నయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: కుటుంబంలో అత్యంత కీలక పాత్రను పోషించే మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌కే మహబూబ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ సహకారంతో ఇస్లాంపేట కమ్యూనిటీ హాలులో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత చిన్న పిల్లలు, మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, రక్తహీనత కనిపిస్తోందన్నారు. వయసుతో సంబంధం లేకుండా చిన్న వయసులోనే చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్‌లు చేయించుకోవడం ద్వారా అనారోగ్యాలను ముందుగానే అరికట్టవచ్చన్నారు. వైద్యులు, సర్దార్, సీపీఐ నాయకులు ఎంఎ సోలార్, కమ్యూనిటీ సభ్యులు అబ్దుల్ రవూఫ్, మారెళ్ల సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, ఖాదర్‌బాషా, రఫీ, ఎస్‌కే కరీముల్లా పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న మహబూబ్

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



ప్రత్యేక శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటల ద్వారా విద్యనందించేందుకు టీచర్లు కృషి చేయాలని తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అన్నారు. సంతనూతలపాడు హైస్కూల్లో మంగళవారం మండల స్థాయి అంగన్‌వాడీ టీచర్ల ముగింపు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోర్స్ కోఆర్డినేటర్, సంతనూతలపాడు హైస్కూల్ హెచ్‌ఎం యం.ప్రమోద అధ్యక్షత వహించారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారంతో పాటు ఈ శిక్షణ ద్వారా మెరుగైన విద్యాభివృద్ధికి పాటుపడాలని ఆమె కోరారు. జిల్లా సర్వ శిక్ష అభియాన్ ఏఎంవో ఎం.రమేష్ టి.ఎల్.ఎం మేళాను పరిశీలించారు. శిక్షణకు కోర్సు డైరెక్టర్లుగా ఏ.చంద్రమౌళేశ్వర్, డీ వెంకా రెడ్డి, డీఆర్పీలుగా ఏ విజయ్ లక్ష్మి, శేషు కుమారి, మౌలా కాన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతి బాయ్, కేఆర్ పీపీ పద్మావతి వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కె.వి రత్నం, ఏ ధనమ్మ, కే మారుతి ప్రసాద్, కే శ్రీదేవి, సంతనూతలపాడు మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



బీసీ హాస్టల్లో విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ ఆనంద మోహన్

మద్దిపాడు: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, ఎస్సీ హాస్టల్ ల విద్యార్థులను పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సూపర్‌వైజర్ బాలకోటయ్య, వైద్య శాఖ సిబ్బంది, హాస్టల్ వార్డెన్లు ఉన్నారు.

గాదెపాలెం గ్రామ సమైక్య సమస్యను పరిష్కరించాలి

కొత్తపట్నం: మండలంలోని గాదెపాలెం గ్రామ సమైక్య అధ్యక్షురాలి సమస్య పరిష్కరించాలని ఏరియా కో ఆర్డినేటర్ విజయమ్మకు డ్వాక్రా గ్రూపు సభ్యులు, లీడర్లు విజ్ఞప్తి చేశారు. వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల సమైక్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. సమావేశం అనంతరం గాదెపాలెం గ్రూపు సభ్యులు ఏసీకి పలు విషయాలు చెప్పారు. గ్రామ సమైక్య అధ్యక్షురాలి ఎన్నికని చెప్పకుండా సంతకాలు పెట్టించుకుని తీర్మానం పుస్తకం ఏపీఎం తన వెంట తీసుకెళ్లారని చెప్పారు. ఈ నెల 12న స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీడీవో కృష్ణ దృష్టికి ఆలూరు ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి, వీఓఏ దివ్వలక్ష్మి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీపీ, ఎంపీడీవో ఈ నెల 15న గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ నెరవేరక పోవడంతో వెలుగు కార్యాలయంలో జరిగే మండల సమైక్య సమావేశంలో గాదెపాలెం నుంచి డ్వాక్రా లీడర్లు, సభ్యులు వచ్చి సమస్యను విన్నవించుకున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ఒంగోలు టౌన్: ఒంగోలు కొత్తపట్నం రోడ్డులోని కొప్పోలులో అక్రమంగా తొలగించిన గృహాలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం బృందం కొప్పోలు ప్రాంతాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కొప్పోలు రోడ్డు పులి వెంకట రెడ్డి కాలనీ, ఇందిరా కాలనీ, రాజీవ్ గృహకల్ప, విలేకరుల కాలనీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర ప్రాంతాల్లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను ప్రభుత్వం అక్రమంగా కూల్చి వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాల్లో కూలీ నాలి చేసుకొని శాశ్వత నిర్మాణాలు కట్టుకొని నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గం అన్నారు. రోడ్డు ఆక్రమణ పేరుతో రోజువారీ వృత్తులు చేసుకొని జీవించే పేదలు, చిరు వ్యాపారుల పొట్టలు కొట్టారని మండిపడ్డారు. ఇంటి ముందు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకోవడాన్ని సహించలేక పోయారన్నారు. సీపీఎం నాయకులు జి.రమేష్, తంబి శ్రీనివాసరావు, ఎస్‌డీ హుసేన్ ఉన్నారు

రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



విద్యుద్దీపాలతో రామలింగేశ్వరస్వామి ఆలయం



మడనూరులో రథోత్సవానికి సిద్ధమైన రథం

మడనూరు (కొత్తపట్నం): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, కొత్తపట్నంలో నాగేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం చుట్టూ చెత్తాచెదారం తీసి వేయించి కోనేరును శుభ్రం చేయించారు. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో చిన్న విగ్రహాలకు రంగులు వేయించారు. రథం శుభ్రం చేయించి విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు ఇబ్బంది పడకుండా రోడ్డు వెంట ఉన్న బల్లలు, చిరు వ్యాపారులను దూర ప్రాంతాలకు తరలించారు. కొత్తపట్నంలో నాగేశ్వరస్వామి ఆలయంను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈవో సుబ్రహ్మణ్యం కోరారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులతో విద్యార్థులు

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు లోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి కోటిరెడ్డి తన భార్య పెద్దిరెడ్డి ఆదిలక్ష్మి పేరిట ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా ఆర్ఫన్స్, సెమీ ఆర్ఫన్స్ విద్యార్థినీ విద్యార్థులకు రెండు జతల దుస్తులు, షూస్, రైటింగ్, జామెంట్రీ మెటీరియల్స్ మంగళవారం పంపిణీ చేశారు. రుద్రవరం, వల్లూరు జెడ్పీ హైస్కూళ్లు, ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మైనంపాడు, మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇంకొల్లు ఎన్‌వీఆర్ అండ్‌వీఆర్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాలల్లోని 110 మంది విద్యార్థులకు ఏడేళ్లుగా క్రమం తప్పకుండా వీటిని అందిస్తున్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



రీ సర్వే గురించి సిబ్బందిని వివరాలు అడుగుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నాగులుప్పలపాడు: పి-4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పోతవరం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పి-4 సర్వేతో పాటు భూముల రీ సర్వే తీరును పరిశీలించారు. పీ-4 సర్వే లో భాగంగా స్థానికులతో మాట్లాడి వారి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది ఏమైనా లంచం అడుగుతున్నారా అని స్థానికులను కలెక్టర్ ప్రశ్నించారు. అనంతరం గ్రామంలో రీసర్వే చేస్తున్న భూములను కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే లో నిర్లక్ష్యం వహించరాదని, మ్యుటేషన్ ప్రక్రియలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ముందస్తుగా నోటీసులు జారీ చేసి రైతుల సమక్షం లోనే సర్వే చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సర్వే శాఖ సహాయ సంచాలకుడు గౌస్ బాషా, ఎంపీడీవో మహాలక్ష్మి, అధికారులు ఉన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శివపార్వతులు



విద్యుత్ దీపాలంకరణలో శివపార్వతుల విగ్రహాలు

సంతనూతలపాడు: మహాశివరాత్రి పురస్కరించుకొని సంతనూతలపాడు శివాలయం ముందు వైపున ఉన్న శివపార్వతుల విగ్రహాలను నిర్వాహకులు మహాశివరాత్రిని పురస్కరించుకుని సుందరంగా ముస్తాబు చేసి, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సంతనూతలపాడు కు చెందిన వెల్లంపల్లి వెంకట సత్యనారాయణ కుటుంబీకులు, మాజీ ఎంపీపీ దుంపా చెంచి రెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ దంపతులు శివ పార్వతి విగ్రహాలను 2018వ సంవత్సరంలో ఆవిష్కరించారు. బుధవారం మహాశివరాత్రి వేడుకలను దాతలు ఘనంగా నిర్వహించనున్నారు. ఏర్పాట్లను మాజీ ఎంపీపీ దుంపా చెంచి రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాల్సిందిగా కోరారు.

సాయిబాబా సత్సంగ కేంద్రం ప్రారంభం



కోలాటంతో నగరోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

చీమకుర్తి: చీమకుర్తిలో మంగళవారం సాయిబాబా నూతన సత్సంగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరం నుంచి బాబా చిత్రపటంతో మహిళా భక్తులు ఉత్సాహంగా కోలాటంతో సాయిబాబా గీతాలను ఆలపిస్తూ నగరోత్సవం నిర్వహించారు.